సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 9 । డిసెంబర్ । 2023



నాడు నిస్సహాయులు..

అనురాగ నిలయం చిన్నారులు అదరగొడుతున్నారు. విజేతలుగా నిలుస్తున్నారు. - 8లో



జాబ్‌మేళాలో 221 మంది..

జాబ్‌మేళాలో 221 మంది ఎంపికయ్యారు. వీరు పలు కంపెనీల్లో పనిచేస్తారు. - 8లో

'తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తున్నాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: మిచాంగ్‌ తుఫాన్‌ వల్ల జిల్లాలో తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలాంటి ధాన్యం రైతుల వద్ద ఉంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌ కె.శ్రీనివాస్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తడిసిన ధాన్యం తేమ శాతం పరీక్షించి తేమ ఎక్కువగా ఉన్నా కూడా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

నమ్మకంగా నామాలు



గార ఎస్‌బీఐలో బంగారం మాయమైన కేసులో రికవరీ చేసిన గోల్డును చూపిస్తున్న ఎస్పీ రాధిక

తీరుమారని గార ఎస్‌బీఐ

- బ్యాంకుని భ్రష్టు పట్టించిన ఇంటి దొంగలు
- ఆడిట్‌ లోపాలతోనే అక్రమాలు
- అధికారుల పాత్రపై అనుమానాలు
- నిగ్గు తేల్చాల్సిన సమయమిదే అంటున్న ఖాతాదారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: బ్యాంకుపై జనం పెట్టుకున్న నమ్మకాన్ని ఇంటి దొంగలు నడిబజారులో అమ్మేశారు. తాకట్టు బంగారం మాయమైన గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గతంలో రూ.15కోట్ల విలువైన నకిలీ రుణాల కుంభకోణం జరిగింది. రైతులు లేకుండానే వారి పేరు మీద అకౌంట్లు సృష్టించి రూ.15కోట్ల విలువైన రుణాలను అప్పటి సిబ్బందిలో కొందరు తమ సొంత ఖాతాలకు మళ్లించుకున్నారు. ఈ కేసులో బ్యాంకు మేనేజర్‌తో సహా నలుగురు సస్పెండ్‌ కూడా అయ్యారు. ఇప్పుడు రూ.7కోట్ల విలువైన 7కిలోలకు పైగా తాకట్టు బంగారాన్ని పక్కదారి పట్టించారు. ఇందులో కూడా సస్పెన్షన్లు, అరెస్టులు జరిగాయి. మధ్యలో వ్యవసాయ రుణాల పేరిట కమీషన్లు తీసుకోవడం, బీసీ రుణాల పేరిట ముడుపులకు కక్కుర్తి పడిన సందర్భాలూ ఉన్నాయి. మొత్తానికి గార ఎస్‌బీఐకు అక్రమాలు కొత్తేమీ కాదన్నట్లు వరుస సంఘటనలు జరుగుతున్నాయి. ఇప్పుడక్కడ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.

బ్యాంకు అధికారులతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ డొల్లతనం కనిపిస్తోంది.

గత ఏడాది నుంచే..

గత సంఘటనలు పక్కన పెడితే పోలీసు అధికారుల విచారణ ప్రకారం 2022 సెప్టెంబర్‌ నుంచి ఇక్కడ తాకట్టు బంగారం బయటికెళ్లినట్టు తేలింది. అంటే దాదాపు 14 నెలలుగా ఖాతాదారుల తాకట్టు బంగారం పక్కదారి పడుతోంది. ఇంత జరుగుతున్నా బ్యాంకు ఉన్నతాధికారులు కనిపెట్టలేకపోవడం ఆశ్చర్యకరమే. అసలు బ్యాంకులో ఉన్న బంగారం బయటకు రావడమే తప్పు. దానికి తోడు ఆ బంగారాన్ని మారు తాకట్టు పెట్టడం మరింత నేరం. కానీ బ్యాంకు ఉద్యోగులు మాత్రం ఖాతాదారుల నమ్మకాన్ని వమ్ము చేశారు. బ్యాంకులపై నమ్మకంతో ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారాన్ని బయటకు పంపిస్తే తిరిగి అవి ఎంత భద్రంగా వస్తాయన్నది అనుమానమే. మొత్తానికి పక్కదారి పట్టిన బంగారం ఎట్టకేలకు పోలీసుల విచారణతో రికవరీ అయింది. అందులో ప్రమేయం ఉన్న ఏడుగురిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. అసలు సిసలు దర్యాప్తు ఇప్పుడే మొదలైంది.

అధికారుల పాత్ర ఉందా..?

గార ఎస్‌బీఐలో 7కిలోలకు పైగా బంగారం మిస్సింగ్‌ వెనక స్థానిక బ్రాంచి ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులే కాదు సంబంధిత అధికారుల పాత్ర కూడా ఉండవచ్చని అంటున్నారు.

- సాధారణంగా బ్రాంచి స్ట్రాంగ్‌ రూమ్‌ల్లోని సెల్ఫ్‌ల్లో ఉన్న తాకట్టు బంగారంపై ఎప్పటికప్పుడు పరిశీలన, ఆడిట్‌ జరగాలి. నెలకొకసారి తాకట్టు బంగారాన్ని పరిశీలించాలి.
- మూడు నెలలకొకసారి ఆడిట్‌ చేయాలి. ఇదంతా బ్యాంకు ఉన్నతాధికారుల బాధ్యత.
- ఇక్కడ 14 నెలలుగా బ్యాంకు నుంచి తాకట్టు బంగారం పోతుంటే పరిశీలన, ఆడిట్‌ ఏ రకంగా చేసినట్లో సంబంధిత అధికారులే చెప్పాలి.
- ఇందులో ఎవరి పాత్ర ఏంటో, ఎవరికెంత వాటానో, ఎంతమేరకు చేతులు మారిందో తేలాల్సి ఉంది.
- పోలీసు అధికారులతో పాటు బ్యాంకు యాజమాన్యం కూడా అసలు మూలాలను గుర్తించాలి. లేదంటే కీలక వ్యక్తులను విస్మరించినట్టు అవుతుంది.
- స్ట్రాంగ్‌ రూమ్‌ల్లోని సెల్ఫ్‌లకు సంబంధించి కస్టోడియన్‌లుగా ఇద్దరు వ్యక్తుల వద్ద వేర్వేరు తాళాలు ఉంటాయి.
- ఆ ఇద్దరు కలిసి తెరిస్తే తప్ప సెల్ఫ్‌ల నుంచి బంగారం బయటికి రాదు.
- ఇక్కడ ఏడాదికి పైగా తాకట్టు బంగారం పక్కదారి పడుతుందంటే కుమ్మక్కై కుట్ర పూరితంగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు స్పష్టమవుతోంది.

మళ్లీ జరగకూడదంటే..

ప్రతి మూడు నెలలకొకసారి బ్యాంకులో ఆడిట్‌ జరుపుకోవాలి. ఖాతాదారులు కూడా ఎప్పటికప్పుడు తమ బంగారాన్ని సరిచూసుకోవాలి. ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. కేసు నమోదు చేసిన వారం రోజుల్లోనే సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మిస్సింగ్‌ బంగారాన్ని చేధించడమే కాకుండా ముద్దాయిలను అరెస్టు చేశాం. - జీఆర్‌ రాధిక, ఎస్పీ



తాకట్టు కనికట్టు తేలింది

- వీడిన గార ఎస్‌బీఐ గోల్డ్‌ కేసు మిస్టరీ
- రూ. 4.7కోట్ల విలువైన 7.146 కిలోల బంగారం రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్‌ : జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార ఎస్‌బీఐ తాకట్టు బంగారం మాయం కేసును పోలీసులు ఛేదించారు. కేసులో రూ. 4.7 కోట్ల విలువైన 7.146 కిలోల బంగారం రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఆ మేరకు..

గార స్టేట్‌ బ్యాంకులో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారంలో 86 బంగారు సంచులు పోయాయని శ్రీకాకుళం ఎస్బీఐ రీజనల్‌ బిజినెస్‌ ఆఫీస్‌ మేనేజరు తోటకూర రమణమూర్తి రాజు గత నెల 30న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. శ్రీకాకుళం ఇన్‌చార్జి డీఎస్పీ విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలోని రెండు పోలీసు బృందాలు ఇన్వెస్టిగేషన్‌ చేశాయి. కేసుకు సంబంధించి తొమ్మిది మంది పాత్ర ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు ఈ నెల 7న ఏడుగురిని అరెస్టు చేయగా.. బ్యాంకు ఉద్యోగి ఉరిటి స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకున్నారు. బ్యాంకు క్యాషియర్‌ సురేష్‌ పరారీలో ఉన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన స్వప్నప్రియ ఈ కేసులో ప్రథమ ముద్దాయి కాగా.. ఆమె సోదరుడు కిరణ్‌బాబు, మరో ఉద్యోగి ముంజి సురేష్‌లు నంబాన రాజారావు అనే వ్యక్తితో కలిసి ఈ బంగారాన్ని మాయం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కమీషన్లకు ఆశపడిన లోహిత్‌క్షి కన్సల్టెన్సీ సర్వీసు యజమాని పొన్నాడ తిరుమలరావు ఆ బంగారాన్ని బినామీల పేర్లతో పలు బ్యాంకుల్లో మారు తనఖా పెట్టి సొమ్ము చేసుకున్నారు. తిరుమలరావుకు సహకరించిన సీఎస్బీ బ్యాంకు ఉద్యోగులు కొండాల గణపతిరావు(మేనేజర్‌), కరకల తారకేశ్వరరావు (ఆమదాలవలస బీడీఓ), మార్పు వెంకటరమేష్‌, మొదలవలస మోహన్‌చంద్‌లు(తిరుమలరావు మావయ్య) ముద్దాయిలుగా గుర్తించారు.

బ్యాంకు మేనేజర్‌కు తెలిసిందిలా..

బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పరిచేస్తున్న ఉరిటి స్వప్నప్రియ బంగారం భద్రపరిచే రూమ్‌లో ఒక్కరే బంగారం బ్యాగులు తీస్తున్నట్లు సీసీ ఫుటేజీలో కనిపించడంతో ఆమెను మేనేజర్‌ చెల్లాపు రాధాకృష్ణ విచారించారు. క్యాషియర్‌ ముంజు సురేష్‌ లేకుండా ఎందుకు బంగారం తీస్తున్నారని ప్రశ్నించగా ఆమె సమాధానం దాటవేశారు. దీంతో అనుమానం వచ్చిన మేనేజరు ఆడిట్‌ చేయగా 86 బంగారం బ్యాగులు లేనట్లు తేలింది. దీనిపై ఆమెను ప్రశ్నిస్తే.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా క్యాషియర్‌ సురేష్‌, సోదరుడు కిరణ్‌బాబు, నంబాన రాజారావులతో కలిసి లోన్‌కన్సల్టెన్సీ తిరుమలరావుకు 86 బ్యాగులు ఇచ్చినట్లు చెప్పింది.

ఆర్థిక ఇబ్బందులే కారణం..

స్వప్నప్రియ మోసం వెనుక ఆమెతో పాటు సోదరుడు కిరణ్‌బాబుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలిసింది. అన్నయ్యతో కలిసి రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం, మైన్స్‌, రైస్‌ పుల్లింగ్‌, షేర్‌మార్కెటింగ్‌లో కలిసి డబ్బులు పెట్టగా పూర్తిగా నష్టపోయింది. ఆ సమయంలోనే లోహిత్‌క్షి కన్సల్టెన్సీ పొన్నాడ తిరుమలరావుతో పరిచయమైంది. స్వప్నప్రియ తిరుమలరావుతో తన అన్నయ్య కిరణ్‌కు రాజకీయ నాయకులు, అధికారులతో సంబంధాలు ఉన్నాయని, బ్యాంకులో ప్రజలు పెట్టిన బంగారు ఆభరణాలను మీరు బయట తనఖా పెట్టి సొమ్ము ఇప్పిస్తే మీకు కమీషన్‌ ఇప్పిస్తానని చెప్పడంతో ఆయన సరేనన్నాడు. ఈ క్రమంలో 2022 సెప్టెంబరులో వంద గ్రాముల బంగారు ఆభరణాలు క్యాషియర్‌ సురేష్‌ సహకారంతో స్వప్నప్రియ తిరుమలరావుకు ఇవ్వగా శ్రీకాకుళంలో ఉన్న ఫెడరల్‌ బ్యాంకులో రూ. 4 లక్షలకు లోన్‌ పెట్టి ఆమెకు ఇచ్చారు. దీనికి ప్రతిగా ఆమె కమీషన్‌ రూ. 3 వేలు ఇచ్చింది. ఇదే పంథాలో సురేష్‌, కిరణ్‌, రాజారావుల సహకారంతో దఫదఫాలుగా తిరుమలరావుకు బంగారు సంచులివ్వసాగారు.

ప్రైవేటు బ్యాంకుల్లోనూ..

స్వప్నప్రియ ఇచ్చిన బంగారాన్ని తిరుమలరావు శ్రీకాకుళంలో ఉన్న ఫెడరల్‌బ్యాంకు, శ్రీకాకుళం, అరసవిల్లి, ఆమదాలవలస సీఎస్బీ బ్యాంకుల్లో తన మామయ్య మోహన్‌చంద్‌, బ్యాంకు ఉద్యోగులు గణపతిరావు, తారకేశ్వరరావు, వెంకటరమేష్‌ల సహకారంతో వేర్వేరు వ్యక్తుల మీద బంగారం లోన్‌ పెట్టేవాడు. వచ్చిన డబ్బులను స్వప్నప్రియ, కిరణ్‌బాబు, రాజారావులకే కాక ఆమె చెప్పిన వ్యక్తులకు నగదు రూపంలోను, అకౌంట్‌ ద్వారా వేసేవాడు. ఇలా దాదాపు రూ. 1.5 కోట్లను నగదు రూపేణా, 2.5 కోట్లను అకౌంట్‌ ట్రాన్స్‌ఫర్‌ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బ్యాంకుకు ఎవరైనా బంగారం రికవరీ కోసం వస్తే ఒక రోజు తర్వాత రమ్మని చెప్పి అంతే బరువు గల మరో బ్యాగ్‌ను ప్రైవేటు బ్యాంకులో ఉంచి అసలు బ్యాగ్‌ను తెచ్చి ఇచ్చేవారు.

బంగారాన్ని రికవరీ చేశారిలా..

బ్యాంకులో బంగారం పోయిందనే విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు స్వప్నప్రియ సోదరుడు కిరణ్‌ ముందుగా 26 బ్యాగులను తెచ్చి ఇచ్చేశారు. మిగతా 60 బ్యాగులను పోలీసుల విచా రణలో భాగంగా తిరుమలరావు వివిధ బ్యాంకుల నుంచి విడిపించి పోలీసులకు అప్పజెప్పాడు. ఈ కేసులో ఎస్బీఐ జిల్లా రీజనల్‌ మేనేజర్‌ పాత్ర ఏమైనా ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎస్పీ బదులిస్తూ.. బ్యాంకుల్లో ప్రతి మూడు నెలలకు ఆడిట్‌ జరుగుతుందని, కచ్చితంగా ఉన్నతాధికారులు వెరిఫికేషన్‌ చేస్తారని, ఈ ఉదంతం బయటపడటంతో అన్ని బ్యాంకులకు వెరిఫికేషన్‌ జరిగిందని అన్నారు. బ్యాంకు ఉన్నత ఉద్యోగి ప్రమేయంపై బ్యాంకు అథారిటీ వారే తేల్చాల్సి ఉందన్నారు. బంగారాన్ని కోర్టు ద్వారా బ్యాంకు వారికి తద్వారా బ్యాంకు ఖాతాదారులకు అప్పగిస్తామని తెలిపారు. కేసులో చాకచక్యంగా పనిచేసిన విచారణాధికారి డీఎస్పీ విజయ్‌కుమార్‌, డీఎస్పీ కె.బాలరాజు, రూరల్‌ సీఐ సన్యాసినాయుడు, సీసీటీఎస్‌ సీఐ బాబ్జీరావు, దర్యాప్తు అధికారి గార సీఐ కామేశ్వరరావు, సీఐ దాలిబాబుచ సైబర్‌సెల్‌ ఎస్‌ఐ ప్రసాదరావు, ఎస్‌ఐలు పారినాయుడు, లక్ష్మణరావు, రవికుమార్‌, గణేష్‌, విజయ్‌కుమార్‌, ప్రవల్లిక, లక్ష్మిలకు ఎస్పీ రివార్డులనందించారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు సేవలను కొనియాడారు.



సిబ్బందికి ప్రోత్సాహకం అందిస్తున్న ఎస్పీ రాధిక

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

- 15న పలాస రానున్న సీఎం వైఎస్‌ జగన్‌
- అధికారులకు మంత్రి సీదిరి దిశా నిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఉద్దానం కిడ్నీ రోగుల కోసం నిర్మించిన కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌, వైఎస్సార్‌ సుజల ధార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఈ నెల 15న జిల్లాకు వస్తున్నారని పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌, ఎస్పీ జీఆర్‌ రాధికతో కలిసి సమీక్షించారు. సీఎం పర్యటన పండగ వాతావరణంలో జరగాలని, అందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని మంత్రి కోరారు. పర్యటనలో భాగంగా ఇండస్ట్రియల్‌ పార్కుకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌ విశాఖపట్నం నుంచి జిల్లాలోని కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి ప్రత్యేక హెలీ కాప్టర్‌ ద్వారా చేరుకుంటారని, అక్కడ వైఎస్సార్‌ సుజలధార పథకాన్ని ట్యాంకు వద్ద ప్రారంభిస్తారని చెప్పారు. అక్కడి నుంచి కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌కు హెలీ కాప్టర్‌లో చేరుకుంటారని, తర్వాత రైల్వే మైదానంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. వర్షం పడితే సభా స్థలంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సభకు వచ్చే వారికి మంచి నీరు పలాస మున్సిపల్‌ కమిషనర్‌, భోజన ఏర్పాట్లు జిల్లా సరఫరాల అధికారి చూడాలన్నారు. ఇన్‌చార్జి మంత్రి, ఇతర మంత్రులు పక్క జిల్లాల మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల జిల్లాకు వచ్చే అవకాశం ఉందని, ప్రోటోకాల్‌ ఏర్పాట్లు చూసుకోవాలని పలాస సబ్‌ కలెక్టర్‌కి ఆదేశించారు. వేదిక వద్ద జగనన్నకు చెబుదాం పేరుతో నాలుగు గ్రీవెన్స్‌ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ జీఆర్‌ రాధిక మాట్లాడుతూ 2000 మంది సివిల్‌, ఏఆర్‌ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రత, ఐదు చోట్ల పార్కింగ్‌ ఏర్పాట్లు చేస్తామన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ మాట్లాడుతూ పర్యటన విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష మందితో సీఎంకు స్వాగతం పలుకుదాం

కాశీబుగ్గ : కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్‌ సుజలధార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి లక్షమందితో ఘన స్వాగతం పలుకుదామని మంత్రి డాక్టర్‌ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమీక్షించారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా అప్పట్లో పలాస వచ్చిన సీఎం వైఎస్‌ జగన్‌ ఇచ్చిన మాట ప్రకారం కిడ్నీ ఆస్పత్రి, వాటర్‌ గ్రిడ్‌ ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి చేశారని తెలిపారు. గత అరవై ఏళ్లుగా చేతకాని కుటుంబ పాలనలో పలాస నియోజకవర్గం మగ్గిపోయిందని, దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి మన ప్రాంతానికి అవసరమైనవన్నీ అందించి ప్రేమను చాటుకుంటున్నారని అన్నారు. కిడ్నీ రీసెర్చ్‌ సెంటర్‌లో సిటిస్కాన్‌, ఎక్స్‌రేలు, డయాలసిస్‌, ఈడబ్ల్యూఎస్‌(కిడ్నీలో రా ళ్ల కరిగించే యంత్రం), డయాలసిస్‌ వంటి సౌకర్యాలు ఉంటాయని అన్నారు. శుద్ధమైన నీరు అందించాలనే ఉద్దేశంతో రూ.700 కోట్లతో హిరమండ లం నుంచి వంశధార జలాలు తెప్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణ రాజు, పలాస–కాశీబుగ్గ మున్సిపల్‌ చైర్మన్‌ బి.గిరిబాబు, పానిల శ్రీనివాస్‌, వెంకటరావుదొర, డొక్కరి దానయ్య, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్‌, మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, రాపాక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

సీఎం వైఎస్‌ జగన్‌తోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధిస్తోందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ సీఎం ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని అన్నారు. తాగునీటి ప్రాజెక్టు, కిడ్నీ ఆస్పత్రి, మూలపేట పోర్టు ఏర్పాటు చేశారన్నారు. సీఎంపై పవన్‌ కల్యాణ్‌ చేస్తున్న విమర్శల్లో వాస్తవాలు లేవన్నారు. నాడు పాదయాత్రలో ఉద్దానం కష్టాలు చూసి ఆ మేరకు ఈ ప్రాంతానికి మేలు చేస్తున్నారని అన్నారు. గత పాలకులు ఈ ప్రాంతానికి ఏం మేలు చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఏమీ చేయని వారికి ప్రశ్నించే అధికారం ఉండదన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి శుక్రవారం వైభవంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. - జలుమూరు

శభాష్‌ వాసు



కొత్తూరు మండలం కుంటిభద్ర కాలనీకి చెందిన ఎండీఎం వ్యాన్‌ ఆపరేటర్‌ దుంపల వాసు కుంటిభద్ర గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రాణం కాపాడారు. వాసు శుక్రవారం కుంటిభద్ర రేషన్‌ డిపో వద్దకు తీసుకువెళ్లి అన్‌లోడ్‌ చేస్తున్నాడు. అంతలోనే రేషన్‌ డిపోకు ఎదురుగా ఉన్న గులివిందల గోవిందరావు ఆయాసంతో కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న ఎండీఎం వ్యాన్‌ ఆపరేటర్‌ తన వ్యాన్‌లో గోవిందరావును ఎక్కించుకుని సైరన్‌ వేసుకుంటూ కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చాడు. ప్రాథమిక వైద్యం అందించిన డాక్టర్లు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్‌ చేసి పంపించారు. వ్యాన్‌ ఆపరేటర్‌ సమయస్ఫూర్తిని అంతా మెచ్చుకున్నారు. - కొత్తూరు

మంత్రి ధర్మానకు ఆహ్వానం



అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఇంద్ర పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన కోసం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఆహ్వానం అందింది. ఆలయ ఈఓ సూర్యప్రకాశ రావు శుక్రవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో ధర్మానను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు గురుగుబెల్లి లోకనాథం , కేఎల్‌ ప్రసాద్‌ ఉన్నారు. -శ్రీకాకుళం రూరల్‌

క్లుప్తంగా

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం ఆర్మ్‌డ్ పోలీసుల ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసులు శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని సూచించారు. అనవసర ఒత్తిడులకు గురి కాకూడదని అన్నారు. ఆరోగ్య పరీక్షల కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు, పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసన్, ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్గత చర్యలకు సిఫారసు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ఏయూలో ఈ నెల 5న జరిగిన విద్యార్థుల ఘర్షణకు సంబంధించి వీసీ నియమించిన కమిటీ నివేదికను అందజేసింది. వర్సిటీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు, వర్సిటీ అధికారులతో కూడిన 12 మంది సభ్యుల బృందం పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించింది. ఇంజినీరింగ్ విద్యార్థులు జన్మదిన వేడుకలు నిర్వహించడం, బాణసంచా కాల్చడంతో పీజీ విద్యార్థులు అడ్డు చెప్పడంతో ఘర్షణ జరిగినట్లు వారు పేర్కొన్నారు. ఘర్షణకు పాల్పడిన వారి పేర్లను కూడా వీసీకి అందజేశారు. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు బాధ్యత తెలియాలంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

12న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో కొనసాగుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా ఉన్న అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్కౌట్స్ అండ్‌గైడ్స్ యూనిట్స్ నడుపుతున్న పాఠశాలల ఉపాధ్యాయులు, కెప్టెన్లు 12న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయానికి హాజరుకావాలని ఆయన సూచించారు. వివరాలకు 97031 48269 నంబర్‌ను సంప్రదించాలని డీఈఓ కోరారు.

కల్తీమద్యం పట్టివేత

పోలాకి: మండలంలోని పిన్నింటిపేట ప్రభుత్వ మద్యం దుకాణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజిలెన్స్ నిర్వహించిన దాడిలో కల్తీ మద్యం బయటపడింది. 180ఎంఎల్ పరిమాణం కలిగిన 44 కల్తీ మద్యం బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేష్‌కుమార్ తెలిపారు. దుకాణం బాధ్యులు తమ్మినేని గోవిందరావు, బీద పవన్ కుమార్, బరాటం ఉదయ్‌శంకర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాలు నడిపిన కొందరు వ్యక్తుల ప్రొద్బలంతోనే ఇక్కడ కల్తీ మద్యం విక్రయిస్తున్నారని స్థానికులు తెలిపారు. దాడిలో ఎస్ఐలు శ్రీరామూర్తి, మహేశ్వరరావులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి ఎగుమతులు ప్రారంభం



లొత్తూరు గిరిజన గ్రామం వద్ద పత్తిని లారీల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న మందస, పలాస మండలాల్లో పండిన పత్తి పంట ఎగుమతులు ప్రారంభించారు. జూన్/జులైలో పంట వేసి పెంపకం సాగించి డిసెంబరు నాటికి పత్తిని సేకరిస్తారు. తుఫాన్ వల్ల వారం రోజులు ఆలస్యం కావడంతో ఎగుమతులకు ఇబ్బంది ఎదురైంది. ఎట్టకేలకు పత్తిని సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఎకరాకి ఐదు క్వింటాళ్ల పత్తిపంట పండే ప్రాంతమైన మందస మండల పరిధిలో 65 హెక్టార్లు, పలాస మండలంలో 20 హెక్టార్లలో పత్తి పంటను పండిస్తున్నట్లు వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు.

నాడు నిస్సహాయులు.. నేడు విజేతలు

- చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్న అనురాగ నిలయం చిన్నారులు
- అనాథాశ్రమంలో చక్కటి ఆదరణ



అనురాగ నిలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: అక్కడ చేరే ముందు వారంతా నిస్సహాయులు. అప్పులు లేక, ఆస్తులు లేక అభాగ్యులుగా మిగిలిపోయిన వారు. ఎవరి పంచన ఉండాలో తెలీక, ఎవరి మీద ఆధారపడాలో అర్థం కాక కన్నీటితో కడుపు నింపుకున్నారు వారు. కానీ ఆ ఆశ్రమం వారి నుదుటి రాతను అందంగా మార్చింది. జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్‌కు అనుబంధంగా మగటపల్లి రమణమూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయంలో చదువుకుంటున్న చిన్నారులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇక్కడ 36 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉన్నారు. 18 మంది మగపిల్లలు కాగా 18 మంది ఆడపిల్లలు ఉన్నారు. వీరికి వేర్వేరుగా హాస్టళ్లు ఉన్నాయి. వీరంతా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చాలా చోట్ల నుంచి ఇక్కడకు వచ్చారు.

నిత్యం కార్యక్రమం

ఇక్కడ పిల్లలు రోజూ 5 గంటలకు లేచి 6 వరకు స్టడీ అవర్స్‌లో ఉంటారు. 6 నుంచి 7.30 గంటల వరకు స్నానాధికాలు చేస్తారు. 7.30 నుంచి 8.45 వరకు టిఫిన్స్ చేస్తారు. అనంతరం ఎవరి స్కూళ్లకు వారు వెళతారు. వారితో పాటుగా మధ్యాహ్నం భోజన కేరేజీలను తీసుకుని వెళతారు. సాయంత్రం 4.15కు మళ్లీ తిరిగి వస్తారు. తర్వాత కొంత మంది దగ్గరలో ఉన్న మైదానానికి ఆటలు ఆడేందుకు వెళ్తారు. 6 నుంచి 8.30 గంటలకు మళ్లీ స్టడీ అవర్స్ ఉంటాయి. వీరికి సాయంత్రం సమయంలో ట్యూషన్ ఉంటుంది. ప్రత్యేకంగా హిందీ కోసం ట్యూటర్ వస్తారు. మగపిల్లలకు, ఆడపిల్లలకు వేర్వేరుగా ట్యూటర్ ఉన్నారు. ఇక్కడ చదువుతో పాటు పిల్లల అభిరుచులకు అనుగుణంగా మృదంగం, సంగీతం, క్రీడలు, యోగా, కరాటే కూడా నేర్పిస్తున్నారు. వారిలో భక్తి ప్రపత్తులు పెరిగేలా విష్ణు సహస్రనామ పారాయణ, లలితా సహస్రనామ పారాయణ, భగవద్గీత పారాయణ, హనుమాన్‌చాలిసా, దేశభక్తి గీతాలు నిర్వహిస్తారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయడానికి ఒక డాక్టర్, నర్సు కూడా ఉన్నారు. ఈ ఆశ్రమం నిర్వహణకు దాదాపు నెలకు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. దాతల సహకారంతో పాటు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్న మూలనిధిపై వస్తున్న వడ్డీలతో నిర్వహిస్తున్నారు.

విజయాలివే..

- ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 ఫుట్‌బాల్ పోటీల్లో చరణ్ అనే విద్యార్థి అద్భుతంగా రాణించాడు.
- రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నగేష్ పాల్గొన్నాడు.
- కూచిపూడి నృత్య విభాగంలో నృత్య దర్శకులు మెహర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సుధారాణి, దుర్గ, భవానీ, పావని, నవ్య, యామినిలు ప్రదర్శన కోసం తిరుపతి, హైదరాబాద్‌లలో ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగారు.
- సుధారాణి అనే విద్యార్థిని హిందీలో ప్రవీణ ఉత్తరార్థ పాసైంది. మిగిలిన వారు ప్రాథమిక, మాధ్యమికలో ఉత్తీర్ణులయ్యారు.

పాలి వెళ్లాను



నేను, నా చెల్లి ఇక్కడే చదువుతున్నాం. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి జైపూర్ రాష్ట్రంలోని పాలి గ్రామానికి టూర్ వెళ్లాను. అలాగే యోగాలో కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

– జి.నగేష్, 10వ తరగతి, అనురాగనిలయం

హిందీ టీచర్ అర్హత సాధించా



నేను 2015లో ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం బీసీఏ చదువుతున్నాను. అలాగే హిందీ ప్రవీణలో ఉత్తరార్థ పాసైయ్యాను. పదోతరగతిలో 10/10 వచ్చింది. ఇంటర్‌లో 926 మార్కులు వచ్చాయి.

– సుధారాణి, బీసీఏ విద్యార్థిని

గోల్ కీపర్‌గా ఎంపికయ్యాను..



నేను విశాఖపట్నంలో మా బంధువుల ఇంటిలో ఉండేవాడిని. నన్ను వాళ్లు బయటకు పంపించేయడంతో ఇక్కడ 6వ తరగతిలో చేర్చారు. అప్పటి నుంచి చదువుతున్నాను. ప్రస్తుతం తొమ్మిదో తరగతికి వచ్చాను. జోనల్ స్థాయిలో గోల్‌కీపర్‌గా రెండో స్థానం సాధించాను. త్వరలో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

– చరణ్, అనురాగనిలయం విద్యార్థి

ప్రపంచ పారా బ్యాడ్మింటన్ క్రీడల్లో సిక్కోలు సత్తా



థాయిలాండ్ గెడ్డపై మూడు రంగుల జెండా ఎగరవేసిన రూపాదేవి



కాంస్య పతకాలు సాధించిన చాపరా పూర్ణారావు

జి.సిగడాం, టెక్కలి: సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవి థాయిలాండ్‌లో జరిగిన పారా బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. ప్రపంచ దేశాల క్రీడాకారులను ఓడించి ఆమె దేశ పతాకాన్ని రెపరెపలాడించింది. అలాగే అవే పోటీల్లో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణారావు 2 కాంస్య పతకాలు సాధించాడు. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఈ పతకాలు సాధించాడు. వీరిని ఆయా ప్రాంతవాసులు అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం ప్రాతినిధ్యం



కె.సంధ్య



షేక్ హసీనా



ఎస్.హర్షిత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సీనియర్స్ మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్–2023 పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డుస్థాయిలో ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో కరగాన సంధ్య (శ్రీకూర్మం), షేక్ హసీనా (రణస్థలం), సంగరి హర్షిత (పలాస) ఉన్నారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈ పోటీలు పంజాబ్ వేదికగా ఈనెల 10 నుంచి జరగనున్నాయి. ఈపోటీల కోసం శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, సంఘ సభ్యులు సాధు మునలినాయుడు, నక్క రామకృష్ణ, ఎస్.రమేష్, మెట్ట తిరుపతిరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణప్రసాద్‌కు ఉత్తమ రైతు అవార్డు



ఉత్తమ రైతు అవార్డు స్వీకరిస్తున్న కృష్ణప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి సేద్యం చేస్తున్న కొంగరాంకు చెందిన గోపిన కృష్ణప్రసాద్ న్యూఢిల్లీలో భారత వ్యవసాయ మండలి నిర్వహించిన కృషిజాగరన్ మేళాలో ఉత్తమ రైతు అవార్డును శుక్రవారం అందుకున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల నివేదిక ఆధారంగా ఆయనకు ఈ అవార్డు లభించింది. గత 15 ఏళ్లుగా ఆయన కొంగరాలో ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. పూల తోటలు, కర్బూజా, వరి, తృణ ధాన్యాలు వంటివి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సైతం నాలుగు ఎకరాల్లో సాంబ మసూరి రకాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలోనే సాగు చేశారు. ఢిల్లీలో మిలీనియం ఫార్మర్స్ మీట్–2023ను ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ఉత్తమ రైతు అవార్డును స్వీకరించారు.

లింగ వివక్షను రూపుమాపుదాం



లింగ వివక్షకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: లింగ వివక్షను రూపుమాపాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మూలసవలాపురం గ్రామంలో నిర్వహించిన ర్యాలీ, అవగాహన సదస్సు కార్యక్రమాల్లో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్, పలువురు సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 221 మంది ఎంపిక



మెగా జాబ్‌మేళాకు హాజరైన యువత

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 221 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎంపికైన వారు ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 508 మంది హాజరు కాగా 221 మంది ఎంపికయ్యారు. వీరికి అధికారులు నియామక పత్రాలను అందజేశారు. అంతకముందు జరిగిన సమావేశంలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపిక కాని అభ్యర్థులు స్కిల్ హబ్స్ ట్రైనింగ్‌లో చేరి వారి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు, జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ స్థానికంగా చేసే ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ఉద్యోగం ఎక్కడ వచ్చినా సరే అందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ వాణికుమారి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏడీఎస్‌డీఈ బి.చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.వంశీకృష్ణ, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ కో ఆర్డినేటర్ల నియామకం



లఖినాన కిషోర్



పిల్లల శివకుమార్

శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదలైంది. పలాస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లఖినాన కిషోర్, జి.సిగడాం మండలం సంతఉరిటి గ్రామానికి చెందిన పిల్లల శివకుమార్‌లను నియమించారు.

టాటా మ్యాజిక్ వాహనం దగ్ధం



టాటా మ్యాజిక్ వాహనం నుంచి వస్తున్న మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఒక్కసారిగా టాటా మ్యాజిక్ వాహనం నుంచి మంటలు వ్యాపించాయి. ఈ సమయంలో డ్రైవర్, ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. కాలిన వాసన రావటంతో డ్రైవర్ వాహనం నిలిపి చూశాడు. దీంతో ఇంజిన్ ముందు భాగంలో మంటలు కనిపించాయి. వెంటనే ప్రయాణికులను కిందకు దించి అత్యవసర విభాగానికి ఫోన్ చేశారు. దీంతో శ్రీకాకుళం ఫైర్ స్టేషన్ సిబ్బంది శకటంతో చేరుకున్నారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించటంతో వాహనం దాదాపుగా కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు గుర్తించారు. డ్రైవర్, ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. పూసపాటిరేగ నుంచి శ్రీకాకుళానికి ప్రయాణికులతో వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

16, 17 తేదీల్లో కళింగాంధ్ర సాహిత్య సమాలోచన

శ్రీకాకుళం కల్చరల్: కళింగాంధ్ర కథ, నవల, కవిత్వం, నాటక రంగాలకు సంబంధించి ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సమాలోచన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకనటలో తెలిపారు. ముగింపు రోజున వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలకు సత్కారం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల సమావేశాలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రచయిత, జర్నలిస్టు నల్లి ధర్మారావు అధ్యక్షన జరిగే ఈ కార్యక్రమానికి కొలకలూరి ఇనాక్, డాక్టర్ ఈమనిరాణిశర్మ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. రచయిత్రి కేఎస్ మల్లీశ్వరి కథా ప్రక్రియపై సమాజం చర్చలో వాడ్రేవు చిన వీరభద్రుడు, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్‌లు పాల్గొంటారని చెప్పారు. చీకటి దివాకర్ అధ్యక్షతన నవలలపై జరిగే చర్చకు అట్టాడ అప్పలనాయుడు, సిరంశెట్టి కాంతారావు, దుప్పల రవికుమార్‌లు ఉంటారని తెలిపారు. కవిత్వంపై చర్చకు సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, సుంకరి గోపాలయ్య, గార రంగనాథం, బాల సుధాకర్‌మౌళి పాల్గొంటారని అన్నారు. నాటక ప్రక్రియపై చర్చకు డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్, కృష్ణప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు.

● కమ్మేస్తున్న పొగమంచు



పల్లెలను పొగమంచు కమ్మేస్తోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పొగమంచు దట్టంగా కురిసింది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి సుమారు 9గంటల వరకు పొగమంచు కురుస్తూనే ఉంది. తుఫాన్ వర్షాల తరువాత పొగమంచు కురవటంతో అపరాల పంటలైన మినుము, పెసర పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఎల్ఎన్ పేట

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

టెక్కలి రూరల్: టెక్కలి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెండి సాయియశ్వంత్ (23) మృతి చెందాడు. టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. సాయియశ్వంత్ తన బైక్‌పై జాతీయ రహదారి నుంచి టెక్కలి వైపుగా వస్తున్నాడు. అతని వాహనానికి ముందుగా వెళ్తున్న ఆటో డిగ్రీ కళాశాల సమీపంలో యూ టర్న్ తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన సాయియశ్వంత్ ఒక్కసారిగా ఆటోను ఢీకొట్టి కిందకు పడిపోయాడు. సరిగ్గా అదే సమయంలో ఆ దారిలో వచ్చిన ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ బస్సు యువకుడిపై నుంచి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగా అతను మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి ఉమామహేశ్వరికి సమాచారం అందించగా.. ఆమె కుమారుడి మృతదేహాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించారు. ఆమె కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంటారు. యువకుడు మర్చంట్ నేవీలో పనిచేస్తుంటాడు. ఇటీవలే సెలవులపై వచ్చాడు. ప్రమాదానికి కారణమైన బస్సును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పింఛన్లే ఆధారం



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 19వ వార్డు సూదికొండ గ్రామం మాది. మా ఆయన జోగి నీలం మరణించారు. నేడు జీడి పరిశ్రమలో రోజువారి కూలీగా పనిచేస్తూ నా పిల్లలను పోషించుకుంటున్నాను. నాకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. అందులో ఒక అబ్బాయికి మాటలు రావు. అందు కోసం ప్రభుత్వం దివ్యాంగ పింఛన్ ఇస్తోంది. మా ఆయన మరణించడంతో నాకు వితంతు పింఛన్ వస్తోంది. గతంలో రెండు పింఛన్లు ఉంటే తీసేసే వారు. కానీ వైఎస్ జగన్ మాత్రం దివ్యాంగులు ఉంటే రెండు పింఛన్లు ఇవ్వవచ్చని చెప్పడంతో మా కుటుంబానికి ఓ ఆధారం దొరికింది.

– జోగి దుర్గ, పింఛన్‌దారు, సూదికొండ, 19వవార్డు, పలాస–కాశీబుగ్గ

అమ్మఒడితో చక్కటి విద్య



మాది సారవకోట మండలం అనుపురం. ఎనిమిదేళ్ల కిందట జలుమూరు మండలానికి వలస వచ్చాం. ఇక్కడే చల్లవానిపేట జగనన్న కాలనీలో ఇల్లు కట్టి గృహ ప్రవేశం కూడా చేశాం. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ చల్లవానిపేటలోని ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. వీరికి అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. భోజనం, బట్టలు, పుస్తకాలు, బూట్లు పిల్లలకు ఇస్తున్నారు. వీటికి తోడుగా అమ్మ ఒడి కూడా పడుతోంది. ఆ డబ్బులతో పిల్లలకు చక్కగా ట్యూషన్ చెప్పిస్తున్నాను. ఇదంతా జగనన్న చలవే. ఆయన మరోసారి సీఎం అయితే మా లాంటి పేదలకు బతుకులు మారిపోతాయి.

– యడ్ల కుమారి, చల్లవానిపేట, జగనన్న కాలనీ

న్యాయ విద్యలో చేరేందుకు నేడే చివరి రోజు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ లా సెట్–2023 కౌన్సెలింగ్‌లో సీటు లభించిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు శనివారం చివరి తేదీ. కాలేజీలో చేరని విద్యార్థులు సీటు కోల్పోవాల్సి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 44 సీట్లు ఉండగా, కౌన్సెలింగ్‌లో 37 మంది విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి న్యాయ కళాశాలకు 20 మంది రిపోర్టు చేశారు. సీటు లభించిన విద్యార్థులు చివరి రోజు రిపోర్టు చెయ్యాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య సూచించారు. రెండో కౌన్సెలింగ్‌లో ఆప్షన్లకు మరో అవకాశం ఉంటుందని వివరించారు.